వేసవి తాపానికి పుచ్చకాయతో చెక్

- పుచ్చలో పోషకాలు మెండు
- ఊపందుకున్న పుచ్చకాయల వ్యాపారం
- రోడ్ల చెంతనే బండ్లపై విక్రయాలు
- వేసవి వేడికి చెక్


రోడ్డు పక్కన పుచ్చకాయ ముక్కలు విక్రయిస్తున్న వ్యాపారి

అయినవిల్లి: సీజనల్‌గా ప్రకృతిలో ఆరోగ్యానికి మేలు చేసే సహజ సిద్ధమైన పండ్లు, కాయలు అనేకం ఉన్నాయి. కానీ వేసవిలో ప్రతి ఒక్కరి దాహాన్ని తీర్చేది మాత్రం పుచ్చకాయే. ఇది చలువ కూడా చేస్తుంది. పుచ్చకాయలో ఆరోగ్య పోషకాలు మెండుగా ఉండటం ఒక ఎత్తు. సీజనల్‌గా ఒక్కో ఫలానికి ఒక్కో ప్రాధాన్యం ఉంటుంది. ఇటీవల వేసవి తీవ్రత పెరిగిన నేపథ్యంలో పుచ్చకాయల విక్రయాలు ఊపందుకున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వాటిని దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. ఒకప్పుడు పుచ్చకాయలు లంకల్లో ఇతోధికంగా పండేవి. కానీ కూలీల లభ్యత తగ్గడం, పంట పూర్తవకుండానే వరదలకు, వర్షాలకు పాడవడం వంటి జరుగుతుండటంతో రైతులు ఇతర పంటలపై మొగ్గు చూపి పుచ్చను వదిలేశారు. వేసవిలో కొబ్బరి, తాటిముంజె, పుచ్చకాయలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ముంజెలు రావడానికి ఇంకొంచెం సమయం పడుతుంది. కొబ్బరి బొండాలు తాగడానికి అందరూ ఇష్టపడినా రోజూ తాగడానికి చాలామంది ఇష్టపడరు. కానీ పుచ్చకాయ ద్రవ, ఘన పదార్థాల కలయికగా ఉండటం. దాని ఎరుపు రంగు ఆకర్షణీయంగా ఉండి చిన్నపిల్లలు సైతం రోజూ తినడానికి ఇష్టపడుతుంటారు. పైగా కొబ్బరి బొండాం నీళ్లు ఎప్పటికప్పుడు తాజాగా తాగితేనే బాగుంటాయి. ఫ్రిజ్‌లో పెడితే వాటి రుచి మారుతుంది. కానీ పుచ్చకాయ అలా కాదు ముక్కలుగా చేసుకుని సగభాగం తినేసి మిగిలిన సగభాగాన్ని ఫ్రిజ్‌లో పెట్టినా బాగానే ఉంటుంది. అందువల్ల ప్రయాణాల్లో రోడ్డు పక్కన దాహార్తి తీర్చుకునేందుకు ఒక్క ముక్క కొనుక్కుని తిన్నా.. ఇంటికి తీసుకెళ్లేటప్పుడు పుచ్చకాయను తీసుకెళ్లి ఇంటిల్లిపాదీ తినడానికే ఇష్టపడుతుంటారు.

పుచ్చకాయలో పోషకాలిలా..

పుచ్చపండులో విలువైన పోషకాలు, శరీరానికి కావాల్సిన నీరు లభ్యమవుతాయి. తేలిగ్గా జీర్ణమవడంతో పాటు జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచే బీటా కెరోటిన్, సీ, ఈ, కే విటమిన్లు, ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి.

పుచ్చకాయల్లో పలు రకాలు

పుచ్చకాయల్లో సుగర్ బేబీ, నాందారి, ఆర్కిమెన్ తదితర రకాలున్నాయి. మొత్తంగా నల్ల, తెల్ల రంగు కాయలుగా పిలుస్తారు. నల్లకాయలు అన్ని కాలాల్లోనూ పండుతాయి. కానీ తెల్లకాయలు వేసవిలోనే పండుతాయి. తినే ఎర్రటి భాగం ఎక్కువగా ఉంటుంది. ముక్కలు చేసి అమ్ముతుంటారు. నల్లకాయ సుమారు 3 కేజీలుండగా కేజీ రూ.20 చొప్పున అమ్ముతున్నారు. తెల్లకాయ సుమారు 15 కేజీల వరకూ ఉంటుంది కేజీ రూ.30 చొప్పున అమ్ముతున్నారు.

దాహార్తి తీరుస్తుంది



ప్రయాణాలు చేసేటప్పుడు ఎండ ధాటికి ద్రవపదార్థాలు ఏదైనా తాగాలనిపిస్తుంది. కానీ మళ్లీ కొద్ది సమయానికే దాహంగా ఉంటుంది. కానీ పుచ్చకాయను తింటే నోటికి రుచి, దాహార్తి తీరి కడుపంతా నిండిన ఫీలింగ్ ఉంటుంది. అందువల్ల పిల్లలు కూడా ప్రయాణ సమయాల్లో పుచ్చకాయ ముక్కలు తినడానికి చాలా ఇష్టపడుతుంటారు. పెద్దలం కూడా కూల్‌డ్రింక్స్ వంటి అధిక సుగర్‌తో కూడిన వాటికంటే ప్రకృతి సిద్ధంగా లభించే వాటిని పిల్లలకు ఇవ్వడానికే ఇష్టపడతాము.

– కేతా వీరవెంకట సత్యనారాయణ, తొత్తరమూడి

ఆరోగ్యానికి మంచిది



పుచ్చపండు ఆరోగ్యానికి మంచిది. 91 శాతం నీటితో నిండిన 100 గ్రాముల పుచ్చ పండు శరీరానికి 46 కేలరీల శక్తిని అందిస్తుంది. 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 26 మిల్లీగ్రాముల విటమిన్ ఎ, 170 మిల్లీ గ్రాముల పొటాషియం, 12 మిల్లీ గ్రాముల విటమిన్ సి, 1 మిల్లీ గ్రామ్ బి6, 0.6 గ్రాముల ప్రొటీన్, 0.4 గ్రాముల ఫైబర్ ఉంటాయి. ప్రస్తుత వేసవిలో పుచ్చకాయలు తినడం ఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ బి.మంగాదేవి, పీహెచ్‌సీ, అయినవిల్లి

క్లుప్తంగా

జగన్‌ను కలసిన దొండపాటి సోదరులు


మాజీ సీఎం జగన్‌ను కలసిన దొండపాటి సోదరులు

మలికిపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌ను పడమటిపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, ఎన్నారై సోదరులు దొండపాటి రత్నారావు, దొండపాటి చిన్ని మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఈ మేరకు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జగన్ కూడా వీరికి శాలువాలు కప్పి అభినందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా జగన్ వారికి సూచించారు.

ర్యాలి యువకుడికి టీచర్ పోస్ట్


మెర్ల నాగసత్య నారాయణ

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన మెర్ల నాగ సత్యనారాయణ రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ బేస్ క్యాంపస్ కేంద్రీయ విద్యాలయంలో టీచర్ ఉద్యోగం సాధించాడు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీబీఎస్‌ఈ బోర్డు ద్వారా నిర్వహిస్తున్న స్కూల్‌లో స్పెషల్ ఎడ్యుకేటర్‌గా ఎంపికయ్యాడు. ప్రతిష్ఠాత్మక రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ వారి ద్వారా ధ్రువీకరించబడిన స్పెషల్ ఎడ్యుకేషన్ ఇంటిలెక్చువల్ డిజబిలిటీలో బీఎడ్ విద్య అభ్యసించాడు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ స్పెషల్ టీచర్ యూనియన్ ఫౌండర్ చైర్మన్, కన్వీనర్‌గా బాధ్యత నిర్వహిస్తూ ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నట్టు సత్యనారాయణ తెలిపారు. రానున్న ఏపీ మెగా డీఎస్సీలో కూడా వివిధ పోస్టులకు అర్హత సాధించినట్టు తెలిపారు. సత్యనారాయణను పలువురు అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: నియోజకవర్గంలోని 26 బాధిత కుటుంబాలకు మంజూరైన రూ.28 లక్షల 17 వేల 498 ముఖ్యమంత్రి సహాయనిధి మొత్తాన్ని చెక్కుల రూపంలో శనివారం పంపిణీ చేశారు. మండలంలోని విశ్వేశ్వరాయపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతుల మీదుగా ఈ సాయం పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు గడచిన కూటమి పాలనలో147 బాధిత కుటుంబాలకు కోటి 67 లక్షల రూపాయల చెక్కులు అందజేశామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ చెక్కుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నానన్నారు. క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా దీనికోసం ఒక విభాగం ఏర్పాటు చేశానని రోజు 5 నుండి 8 అప్లికేషన్లు ప్రాసెస్ అవుతున్నాయని తెలిపారు. తద్వారా సకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలబడే అవకాశాన్ని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కల్పించిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, గుబ్బల ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదనం ఉట్టిపడేలా ఉగాది వేడుక


మామిడికుదురులో సందడి చేసిన విద్యార్థులు

మామిడికుదురు: తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ముందస్తు ఉగాది వేడుకలను మామిడికుదురులో దీప్తి స్కూల్ విద్యార్థులు శనివారం ఘనంగా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరం ఉగాదికి ఘనంగా వెల్‌కం పలికారు. పంట పొలాల గట్టున పరికిణీలు, ఓణీలు ధరించి విద్యార్థినులు సందడి చేశారు. ఉగాది పచ్చడికి వినియోగించే వేప పువ్వు, అరటి పళ్లు, మామిడికాయలు, చింతపండు, ఉప్పు తదితర వస్తువులను ప్రదర్శిస్తూ సందడి చేశారు. పచ్చని మామిడి ఆకులు పదర్శిస్తూ ఆటలు ఆడి, పాటలు పాడి సందడి చేశారు.

విలేకరులపై దాడులు అరికట్టాలి

మలికిపురం: రాష్ట్రంలో విలేకరులపై జరుగుతున్న దాడులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అరికట్టి మరలా ఇటువంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఉన్న విలేకరుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆయన కోరారు. ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా నిర్మించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని అన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించడంలో విలేకరుల పాత్ర ఎంతగానో ఉపయోగపడుతుందని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కాంగ్రెస్ పార్టీ తరపున గోపాలకృష్ణంరాజు డిమాండ్ చేశారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి


ముక్కామలలో షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అంబాజీపేట: గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని దాంతో పాటు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకోవచ్చని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ముక్కామలలో పంచాయతీ నిధులతో నిర్మించిన బీఎస్ఎన్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామపంచాయతీకి ఆదాయం వచ్చేలా వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అనువైనవిగా షాపులు నిర్మించిన సర్పంచ్ బండారు వెంకటలక్ష్మిని, ఆమెకు సహకరించిన ఆమె కుమారుడు మల్లిబాబును అభినందించారు. గ్రామానికి చేసిన అభివృద్ధి పనులే శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. పంచాయతీరాజ్ డీఈ అన్యం రాంబాబు, పంచాయతీ కార్యదర్శి కొయ్యాపు రామకృష్ణ, దొమ్మేటి సత్యమోహన్, అక్కిశెట్టి ప్రసాద్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, కొర్లపాటి కోటబాబు, నాగవరపు నాగరాజు, ఉందుర్తి నాగబాబు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర

మామిడికుదురు: గోగన్నమఠంలో కొలువుదీరిన శ్రీధనమ్మ, కనకదుర్గమ్మ వార్ల జాతర మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. మేళతాళాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం అంగరంగ వైభవంగా జరిపించారు. గురువారం వరకు ఆరు రోజుల పాటు అమ్మవారి జాతర మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. జాతర సందర్భంగా ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భారీగా విద్యుత్ అలంకరణలతో అమ్మవార్ల ఆలయాలను తీర్చిదిద్దారు.

నేడు వనువులమ్మ జాతర

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వనువులమ్మ అమ్మవారి జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అమ్మవారి ఊరేగింపులో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. తీన్‌మార్ డ్యాన్స్‌లు, గరగ నృత్యాలు, కోలాటం, బ్యాండు మేళాలుతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఉదయం మాచవరంలోని ఇటికాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద నుంచి పూజ ఘటాలను ప్రత్యేక పూజలు జరిపి ఆసాదులు శిరస్సును ధరించి జాతర నిర్వహిస్తారు.

పెద్దింట్లమ్మకు అన్నపర్వత మహానివేదన

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం రాత్రి అన్నపర్వత మహానివేదన ఎండోమెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నపర్వత మహానివేదన అనంతరం పెద్దలు, పోలీసు, భక్తులు సమక్షంలో ఆలయం తలుపులు సిబ్బంది మూసివేశారు. తిరిగి యథావిధిగా శనివారం వేకువజామున ఆలయం తలుపులు తెరచి అమ్మవారికి మంగళహారతి ఇచ్చి భక్తులకు దర్శనం కల్పించారు.

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.


కొర్లపాటివారిపాలెంలో..

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామిని ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో వేసవి సందర్భంగా భక్తులు, ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఇటువంటి ఏర్పాట్లు చేయడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు, అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాస్, అడపా నాగభూషణం, కూటమి నాయకులు పాలిశెట్టి రాజేష్ ఉన్నారు.

కళారత్న పురస్కారానికి ప్రతాప్ ఎంపిక


కత్తిమండ ప్రతాప్

సఖినేటిపల్లి: మండలానికి చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త కత్తిమండ ప్రతాప్, ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే కళారత్న పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు ఏపీ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు నుంచి సమాచారం వచ్చినట్టు శనివారం ఆయన మీడియాకు చెప్పారు. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ప్రభుత్వ ఉగాది వేడుకలలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కళారత్న అవార్డుతో పాటు, రూ.50 వేలు ప్రోత్సాహక నగదు, హంస జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకోనున్నట్టు ప్రతాప్ వెల్లడించారు. కాగా తెలుగుభాషాభివృద్ధికి, సాహిత్యానికి, కవిత్వానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా కళారత్న పురస్కారానికి తనను ఎంపిక చేసినట్టు ఆయన అన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి పెదవాడపల్లి గ్రామానికి చెందిన చేబియ్యం సత్యనారాయణ శనివారం రూ.10,116 విరాళం సమర్పించారు. దాత ఈ సొమ్మును ఆలయ అర్చకులు సత్తిబాబుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు.


దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అగ్నిప్రమాద బాధితులకు అండగా రెడ్‌క్రాస్


బాధితులకు సామగ్రి అందిస్తున్న జంపన బుజ్జిరాజు

మలికిపురం: మండలంలోని కత్తిమండలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మేడపాటి శ్రీను, నెల్లూరు మంగ కుటుంబాలకి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలిచింది. జిల్లా అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సూచనలతో రాజోలు, గన్నవరం నియోజకవర్గాల రెడ్ క్రాస్ కార్యక్రమాల సమన్వయకర్త జంపన బుజ్జిరాజు చేతుల మీదుగా టార్పాలిన్, వంట సామగ్రి, ఉలెన్ బ్లాంకెట్, హైజెనిక్ కిట్, బియ్యం, కూరగాయలు అందించారు. శనివారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సహాయ కార్యదర్శి బోనం రాజు, రెడ్ క్రాస్ సభ్యులు అటారం మాస్టారు, కత్తిమండ సర్పంచ్ ఆరేటి రంగనాయకులు, వీఆర్వో వెంకటేశ్వర్లు, ఫీల్డ్ కోఆర్డినేటర్ రత్నప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డికి పలువురి పరామర్శ


సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న శ్రీనివాసరావు


సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న కొత్తపేట మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

మామిడికుదురు: మాతృ వియోగంతో బాధపడుతున్న రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని పి.గన్నవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. ఒంగోలులో సుబ్బారెడ్డిని పరామర్శించి అతని తల్లి చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. ఆయనతో పాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను, బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, చెల్లుబోయిన నాని, కేతా భానుతేజ, ముషిణి రాఘవేంద్ర, పాటి రవి తదితరులు సుబ్బారెడ్డిని పరామర్శించారు.

సుబ్బారెడ్డికి జగ్గిరెడ్డి పరామర్శ

కొత్తపేట/ఆలమూరు: మాతృ వియోగంతో బాధపడుతున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శనివారం పరామర్శించారు. ప్రకాశం జిల్లాలోని ఒంగోలులో సుబ్బారెడ్డి నివాసానికి మాజీ మంత్రి పేర్ని నానితో కలసి వెళ్లారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు సుబ్బారెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పోక్సో చట్టంపై అవగాహన సదస్సు


న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి ప్రమీలారాణి

సఖినేటిపల్లి: స్థానిక డ్వాక్రా కార్యాలయంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వులపై రాజోలు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు పోక్సో చట్టంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి ముఖ్య అతిథిగా విచ్చేసి, పోక్సో చట్టంతో పాటు ఇతర చట్టాల గురించి సీనియర్ సివిల్ జడ్జి వివరించారు. అలాగే మహిళా న్యాయవాదులు జి.రజిత, వై.లక్ష్మిసుధ మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టాలను అన్నింటిపైనా మహిళలు అవగాహన కల్పించుకోవాలని కోరారు. డ్వాక్రా ఏపీఎం అజయ్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎంప్లాయీస్, పెన్షనర్ల అధ్యక్షుల నియామకం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కొత్తపేట, మండపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం పత్రాలను శనివారం పంపించింది. కొత్తపేట నియోజకవర్గానికి కళా అప్పారావు, మండపేట నియోజవర్గానికి సలాది ఎస్.చంద్రరావు నియమితులయ్యారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడికి చెక్కు అందిస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు వైద్యం నిమిత్తం రూ.10,500 చెక్కును శుక్రవారం అందజేశారు. మండలంలోని పొడగట్లపల్లి గ్రామానికి చెందిన పోల్నాటి విష్ణుశ్రీను రావులపాలెంలో ఒక టీ స్టాల్‌లో పని చేస్తున్నారు. 20 రోజుల క్రితం పని ముగించుకుని ఇంటికి వెళుతున్నప్పుడు మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చేయి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో సంస్థ సభ్యులు పొడగట్లపల్లి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా విష్ణుశ్రీనుకి రూ.10,500 చెక్కు అందజేశారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఉగాదికి ఏర్పాట్లు పూర్తి

అయినవిల్లి: విఘ్నేశ్వరుని సన్నిధిలో ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారి ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పంచాంగ శ్రవణం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

ఊడుగులమ్మ తల్లికి జగ్గిరెడ్డి పూజలు


జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్తులు

ఆలమూరు: మండలంలో నర్సిపూడిలో వేంచేసిన గ్రామదేవత ఊడుగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి విచ్చేసి ఊడుగులమ్మని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే స్థానికుల కోరిక మేరకు ఇటీవల నూతనంగా పునర్నిర్మించిన కోదండరామస్వామి ఆయన దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించి దేవుని చిత్రపటాన్ని బహూకరించారు.

అలరించిన చిన్నారుల సభ


చిన్నారుల సభలో ప్రజాప్రతినిధి తరహాలో మాట్లాడుతున్న విద్యార్థిని

పి.గన్నవరం: విద్యార్థుల్లో పోటీతత్వాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు గాను చిన్నారుల సభ అనే వినూత్న కార్యక్రమాన్ని మండలంలోని పోతవరం ప్రాథమిక పాఠశాలలో శనివారం హెచ్ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు విద్యా సంబంధమైన అంశాలు, సహ పాఠ్యాంశాలతో పాటు, దేశభక్తి, అభ్యుదయ, సామాజిక అంశాలను ఈసభలో విద్యార్థులు ప్రదర్శించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో గల ఒక స్క్రిప్టును కూడా చిన్నారులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వడలి కొండయ్య, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, ముంగండ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రమణమూర్తి, ఉపాధ్యాయులు సీహెచ్‌బీ వరలక్ష్మి, ఎండీ ఇస్మాయిల్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న హాస్యనటుడు


నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న హాస్యనటుడు జెన్నీ

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారిని ప్రముఖ సినీ నటుడు, రచయిత, మూకాభినయ కళాకారుడు పోలాప్రగడ జనార్దనరావు (జెన్నీ) దర్శించుకున్నారు. అమలాపురంలో జరుగుతున్న ఒక సినిమా షూటింగ్‌కు వచ్చిన ఆయన తన అమ్మమ్మ గారి ఊరైన చింతలూరు శనివారం వచ్చారు. గ్రామంలో ప్రఖ్యాతి గాంచిన నూకాంబిక అమ్మవారితో పాటు ఉత్తర ముఖ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు దేవస్థానం ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి, చింతలూరు ఫణీంద్ర కుమార్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గన్ని వెంకట్రావు, శ్రీమన్నారాయణ తదితరులు హాస్యనటుడు జెన్నీకి సాదర స్వాగతం పలికారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మలికిపురం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను మహిళా శక్తి సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ విజయవాడ హెచ్‌డీ విభాగం డైరెక్టర్ ఎ.శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జరుగుతున్న మహిళా సంఘాలు, వీఓఎల శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘ సభ్యులు 2025–26లో ఆర్థిక ప్రణాళిక ప్రకారం జీవనోపాధి కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవడానికి కావలసిన రుణాలు తీసుకొనుటకు, తగు సమాచారం కొరకు మొబైల్ యాప్ ద్వారా ఆ గ్రామ సంఘం ద్వారా తాత్కాలికంగా ఎంపిక చేసిన ఎన్యూమరేటర్స్ ద్వారా సర్వే చేయించడం జరుతుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు వీఓఎలు, సంఘాలు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఏపీడీ నాగేశ్వరరావు, డీపీఎం ఎ.గణేష్, అన్నపూర్ణ, ఏపీఏ అజయ్, సీసీ నాగరాజు, శాంతి కుమారి పాల్గొన్నారు.